సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 13 । జూన్ । 2025



టన్ను చీనీ రూ.33,640

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.33,640, కనిష్టంగా రూ.5 వేల ప్రకారం ధర పలికాయి.



కాలుతున్న పచ్చదనం

జిల్లాలోని పారిశ్రామికవాడల్లో పచ్చదనం కాలి బూడిదవుతోంది. పరిశ్రమల నిర్వాహకులు వృక్షాల నరికివేతను ప్రోత్సహిస్తుండటంతో పచ్చదనం కరువవుతోంది. 8లో

గరిష్టం/కనిష్టం
31.2°/21.4°

జిల్ల పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- ఎస్పీ రత్న



పుట్టపర్తి టౌన్: సున్నితమైన విషయాలను పెద్దవి చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ రత్న ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల జిల్లాలో చోటు చేసుకొంటున్న సున్నితమైన విషయాలను రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లి కుటుంబాలను మరింత బాధ పెడుతున్నాయన్నారు. ఇటీవల కాలంలో రామగిరి మండలంలో జరిగిన ఘటనపై బాధితుల పరామర్శ పేరుతో పోలీసులు అనుమతులు లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులకు న్యాయం చేసేందుకు చట్టం ఉందని, బాలిక సంఘటన విషయాన్ని రాజకీయ పార్టీ నాయకులు ఆందోళన ద్వారా బాధితుల వివరాలు బహిర్గతమై వారు ఇబ్బంది పడే ప్రమాదం ఉందన్నారు. బాధితులు హక్కులను భంగం కలిగించకుండా వ్యవహరించాలని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలకు సూచించారు. ఎవరైనా చట్టాలను ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

పట్టు గూళ్ల విక్రయ కేంద్రం నూతన భవన నిర్మాణం

- కేంద్ర వాటా రూ.4 కోట్ల మంజూరు



ప్రస్తుతం హిందూపురంలో ఉన్న పట్టుగూళ్ల విక్రయ కేంద్రం

హిందూపురం: పట్టణంలోని ఏపీ పట్టుగూళ్ల విక్రయ కేంద్రం నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మొత్తం రూ.8 కోట్లు ఖర్చు కానుండగా కేంద్రం వాటా రూ.4 కోట్లను మంజూరు చేసింది. రాష్ట్ర నిధులు ఇంకా విడుదల కాలేదు. కాగా కొత్త పట్టుగూళ్ల విక్రయ కేంద్రం భవన నిర్మాణానికి అర్‌అండ్‌బీ అధికారులు డీఈ వెంకటరామిరెడ్డి, ఏఈ మోహన్‌బాబు సిబ్బంది కొలతలు, మార్కింగ్ వేశారు. త్వరలోనే కేంద్ర నిధులతో పనులు ప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అయితే ప్రస్తుత విక్రయ కేంద్రం ముందుభాగంలో ఉన్న భవనంలోకి ప్రస్తుత కార్యాలయాన్ని మార్చాడానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

పట్టుగూళ్ల కేంద్రం అధికారి బదిలీ..

హిందూపురం పట్టుగూళ్ల విక్రయ కేంద్రం నిర్వాహణ అధికారి లక్ష్మిరెడ్డిని బదిలీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన కడప విక్రయ కేంద్రానికి బదిలీ అయ్యారు. హిందూపురం విక్రయ కేంద్రం అధికారిగా కుప్పం నుంచి హంపయ్యను నియమించారు. రెండురోజుల్లో బదిలీలైన అధికారులు ఆయా ప్రాంతాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బుక్కపట్నంలో ఏటీఎస్ సేవలు ప్రారంభం



పుట్టపర్తి టౌన్: రవాణాశాఖ సేవలు సులభతరం చేయడమే లక్ష్యంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) మంజూరుకై బుక్కపట్నంలో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్)ను ప్రారంభించినట్లు జిల్లా రవాణాశాఖ అధికారి కరుణసాగర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 12 నుంచి ఏటీఎస్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి వాహనదారుడు వాహన ఫిట్‌నెస్ పరీక్ష నిమిత్తం దగ్గరలో ఉన్న ఆటోమెటిక్ టెస్టింగ్ స్టేషన్‌కు వెళ్లాలన్నారు. గతంలో హిందూపురం ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లి ఎఫ్‌సీ చేసుకొనేవారని, అలా కాకుండా సేవలను సులభతరం చేసేందుకు బుక్కపట్నంలో ప్రారంభించామన్నారు. ఈ అవకాశాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అట్రాసిటీ కేసు నమోదు

నల్లమాడ: మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ హనుమంతరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తనపై దాడిచేసి కులం పేరుతో దూషించాడంటూ దళిత యువకుడు కిషోర్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం గురువారం అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పరామర్శపై పైశాచికం!



జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, హిందూపురం సమన్వయకర్త దీపిక తదితరులు



పేరూరుకు వెళ్లకుండా మాజీ మంత్రి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులను మద్దెలచెరువులోనే అడ్డుకుంటున్న పోలీసులు

తండ్రి మరణించాడు..తల్లి మతిస్థిమితం సరిగా లేదు..ఏ ఆధారమూ.. ఎవరి అండాలేని దళిత మైనర్ బాలికపై 14 మంది కీచకులు నెలల తరబడి అత్యాచారానికి పాల్పడితే... నేటికీ బాధిత కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శించలేదు. పైగా ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా నిలిచేందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులనూ అడ్డుకుంది. పోలీసులను ఉసిగొల్పి అడ్డంకులు సృష్టించింది. రౌడీ మూకలతో రాళ్ల దాడి చేయించి భయానక వాతావరణం సృష్టించి పైశాచిక ఆనందం పొందింది.

- వైఎస్సార్‌సీపీ నాయకులపై అధికార జులుం
- అత్యాచార బాలిక కుటుంబాన్ని పరామర్శించకుండా అడ్డంకులు
- పోలీసులను ఉసిగొల్పిన ఎమ్మెల్యే పరిటాల సునీత
- పేరూరుకు వెళ్లకుండా ఎక్కడికక్కడ నాయకులను అడ్డుకున్న వైనం
- ప్లాన్ ప్రకారం వాహనాలపై రాళ్లు రువ్విన పచ్చ రౌడీలు
- వాస్తవాలు బయటికొస్తాయన్న భయంతోనే దాడుల పర్వం

సాక్షి, పుట్టపర్తి/పెనుకొండ రూరల్/చెన్నేకొత్తపల్లి/కనగానపల్లి: సామూహిక అత్యాచారానికి గురైన రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లికి చెందిన మైనర్ దళిత బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు గురువారం ఉదయం బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులను ఇటు పోలీసులు... అటు పచ్చ రౌడీలు అడుగడుగునా అడ్డుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే ఎమ్మెల్యే పరిటాల సునీత పోలీసులను అడ్డుపెట్టుకొని భయభ్రాంతులకు గురిచేసింది.

అడుగడుగునా ఆటంకాలే..

ఏడుగుర్రాలపల్లిలోని దళిత బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఉదయం పేరూరు బయలుదేరారు. పెనుకొండ, చెన్నేకొత్తపల్లి, ఎన్‌ఎస్ గేటు, రామగిరి, నసనకోట, ఎగువపల్లి, మామిళ్లపల్లి, కనగానపల్లి, తగరకుంట, వేపకుంట, మద్దెలచెరువువ తదితర ప్రాంతాల్లో మకాం వేసిన పోలీసులు వచ్చిన వారిని వచ్చినట్లు వాహనాల్లో ఎక్కించుకుని తీసుకెళ్లారు. అంతకుముందు పెనుకొండ వద్ద జాతీయ రహదారిపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక పేరూరు వైపు వస్తుండగా పెనుకొండ సమీపంలో జాతీయ రహదారిపై పోలీసులు అడ్డుకున్నారు. ఎన్‌ఎస్ గేటు వద్ద మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌ను పేరూరు వెళ్లకుండా వెనక్కి పంపించారు. కనగానపల్లి మండలం మద్దెలచెరువు వద్ద మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డిని పోలీసులు అడ్డగించారు. ఎందుకు అడ్డుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రశ్నిస్తే.. పేరూరు వెళ్లేందుకు అనుమతులు తీసుకోవాలని, అనుమతులు లేకుండా వెళ్లాలంటే అంగీకరించేది లేదని పోలీసులు వాగ్వివాదనకు దిగారు.



ధ్వంసమైన వాహనం

ఎక్కడికక్కడ పోలీసులు ఆటంకాలు సృష్టించినా...వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కొందరు పేరూరుకు చేరుకున్నారు. అయితే ముందస్తు ప్రణాళిక ప్రకారం

పక్కా ప్లాన్‌తోనే దాడి..

అక్కడే మకాం వేసిన టీడీపీ అల్లరిమూకలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వెళ్లిన వాహనాలపై రాళ్లతో దాడి చేసి ధ్వంసం చేశారు. పోలీసుల సమక్షంలోనే టీడీపీ రౌడీలు రాళ్లు రువ్వారు. ఘటనలో వైఎస్సార్‌సీపీ నేతల వాహనాలు ధ్వంసమయ్యాయి.

టీడీపీ సంబరాలు..

వైఎస్సార్‌సీపీ నేతల పర్యటన గురించి తెలిసిన వెంటనే గొడవలకు ప్లాన్ చేసిన టీడీపీ నేతలు.. ఉన్నఫలంగా పేరూరులో సంబరాలు చేశారు. తల్లికి వందనం విడుదల సందర్భంగా సంబరాలు చేసుకున్నారు. ఎక్కడిడెక్కడి నుంచో తరలివచ్చిన టీడీపీ కార్యకర్తలు మద్యం తాగి నానా రభస చేశారు. అయినా పోలీసులు వారిని అడ్డుకోకపోవడం గమనార్హం.

వాస్తవాలు బయటికి వస్తాయనే..

ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన అల్లరిమూకలు మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అండదండలతో కొన్నాళ్లు తప్పించుకు తిరిగారు. అయితే అసలు విషయం బహిర్గతం కావడంతో ఇప్పటికే 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మరో ఐదుగురి కోసం గాలిస్తున్నారు. ఇలాంటి సమయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏడుగుర్రాలపల్లికి వెళ్తే.. మరిన్ని విషయాలు బహిర్గతం అవుతాయనే ఉద్దేశంతో పక్కా ప్రణాళికతో పోలీసులను అడ్డు పెట్టుకుని పరిటాల సునీత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు విమర్శించారు.

పరామర్శకు వెళ్తే భయమెందుకు?



ఏడాది నుంచి దళిత మైనర్ బాలిక అత్యాచారానికి గురికావడం బాధాకరం. బాలిక ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వం ఇప్పటి వరకూ హెల్త్ బులిటెన్ ఇవ్వకపోవడం దారుణం. ఈ కేసులలో నిజానిజాలు తెలుసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పేందుకు వెళ్తుంటే ప్రభుత్వం ఎందుకు భయపడుతోంది. బాధిత కుటుంబానికి ఆ గ్రామంలో ప్రాణహాని ఉంది. జిల్లాలోని మంత్రులు, హోంమంత్రి బాధిత బాలికను కనీసం పరామర్శించకపోవడం అత్యంత శోచనీయం. అనంతపురం సమీపంలో గిరిజన యువతి తన్మయి కూడా హత్యకు గురైంది. కుటుంబ సభ్యులు ఐదు రోజుల ముందే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ప్రభుత్వ పనితీరు సరిగా లేకపోవడంతో రాష్ట్రంలో అత్యాచారాలు, హత్యలు, దాడులు పెరిగిపోతున్నాయి. వాస్తవిక పరిస్థితులను తెలుసుకొనేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారో పోలీసులు చెప్పాలి.

-ఉషశ్రీచరణ్,వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

దళితులకు రక్షణ లేదు



కూటమి సర్కార్ హయాంలో దళితులపై దాడులు, దుర్మార్గాలు పెరిగిపోయాయి. ఏడుగుర్రాలపల్లిలో 14 మంది దుర్మార్గులు ఓ దళిత బాలికపై నెలలుగా అత్యాచారకాండ సాగించినా దళిత సామాజిక వర్గానికి చెందిన హోంమంత్రి అనిత, ఈ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న దళిత ఎమ్మెల్యే స్పందించకపోవడం దుర్మార్గం. మేమైనా వెళ్లి బాలిక కుటుంబానికి ధైర్యం చెబుదామనుకుంటే పోలీసుల ద్వారా అడుగడుగునా అడ్డగించారు.

- ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ మడకశిర సమన్వయకర్త

ఎస్పీ ఘాటు హెచ్చరిక..

వైఎస్సార్‌సీపీ నాయకులు పేరూరు పర్యటనకు పోలీసుల నుంచి ఎలాంటి అనుమతులు లభించలేదు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతోనే అనుమతులు ఇవ్వలేదని సమాచారం. పైగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రాజకీయ పార్టీల నాయకులు ఇష్టారాజ్యంగా గ్రామాలకు వెళ్తే.. ఊరుకునేది లేదని ఎస్పీ వి.రత్న తెలిపారు.







మాజీ మంత్రి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని వాహనంలో వెనక్కు పంపుతున్న పోలీసులు, మాజీ మంత్రి శైలజానాథ్‌ను అడ్డుకుంటున్న ఖాకీలు, ఎన్‌ఎస్ గేటులో పోలీసుల బందోబస్తు

అన్యాయం జరిగినా స్పందించకూడదా?

- 'సాక్షి' పత్రికలో రాకుంటే దారుణం బయటకు వచ్చేదేకాదు
- మాజీ మంత్రులు మేరుగ నాగార్జున, శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగ నాగార్జున, చిత్రంలో మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఈరలక్కప్ప తదితరులు

రాప్తాడురూరల్: 'దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా ఒక దళిత మైనర్ బాలికకు ఘోరమైన అన్యాయం జరిగింది. బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పరామర్శించేందుకు వెళ్తుంటే పోలీసులతో అడ్డుకుంటారా.. మేమేమైనా టెర్రరిస్టులమా..' అని మాజీ మంత్రి మేరుగ నాగార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నగర శివారులోని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేరుగ నాగార్జున మాట్లాడుతూ 14 ఏళ్ల దళిత బిడ్డను 18 మంది అఘాయిత్యం చేసిన ఘటనపై స్పందించి అండగా నిలిచేందుకు వస్తే అరెస్ట్ చేశారన్నారు. దీన్ని బట్టి రాష్ట్రంలో ఎలాంటి ప్రజాస్వామ్యం ఉందో, ఈ ప్రాంతంలో ఎలాంటి పాలన సాగుతోందో అర్థమవుతోందన్నారు. హోం మంత్రి, ఈ ప్రాంతంలోని ఎస్సీ శాసనసభ్యులు ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. టీవీలో ఎక్కడో ఏదో మాట్లాడారంటూ అరెస్ట్‌లు చేస్తున్న ప్రభుత్వం, దళిత బిడ్డకు జరిగిన అన్యాయంపై ఎందుకు స్పందించలేదన్నారు. దీనిపై గవర్నరును కలిసి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

దళితురాలిగా పుట్టడమే నేరమా..

దళితులుగా పుట్టడం తప్పా అందులోనూ బాలికగా పుట్టడం నేరమా అని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ప్రశ్నించారు. దళిత బాలికపై అఘాయిత్యానికి పాల్పడినందుకు పేరూరులో విజయోత్సవాలు చేసుకున్నారా.. లేదంటే తమ దెబ్బకు ఎవరినీ రానీయలేదన్నందుకు విజయోత్సవాలు చేసుకున్నారా.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కచ్చితంగా ఆ గ్రామానికి వెళ్లి తీరతామన్నారు. దీనిపై ప్రత్యేక జ్యుడీషియల్ విచారణ జరగాలన్నారు. 'సాక్షి' పత్రికలో వార్త వస్తే తప్ప ఈ ఘోరం వెలుగులోకి రాలేదని వాపోయారు.

ప్రత్యేక పాస్‌పోర్ట్ కావాలా..

బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తుంటే ఎక్కడికక్కడ పోలీసులను పెట్టి అడ్డుకున్నారని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆ ప్రాంతాలకు వెళ్లేందుకు వీసాలు తీసుకోవాలా.. పాస్‌పోర్టులు ఉండాలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సామూహిక అత్యాచారం కేసులో నిందితుల బంధువులు, టీడీపీ శ్రేణులు, పరిటాల సునీత బంధువులు పేరూరులో తమ వాహనాలపై రాళ్లతో దాడి చేసి భయోత్పాతం సృష్టించారన్నారు. పరిటాల సునీత అండతోనే కర్రలు, ఇతర మారణాయుధాలతో వీరంగం సృష్టించారన్నారు. పోలీసులు సమాజానికి ఎలాంటి మెసేజ్ ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. 2014–2019 మధ్య జరిగిన అన్యాయాలు, దౌర్జన్యాలను ప్రశ్నించిన తనను రామగిరి మండలంలోకి అడుగు పెట్టనివ్వలేదని, దాని ఫలితం అనుభవించారన్నారు. మహిళా ఎమ్మెల్యేగా ఉన్న సునీత ఇలాంటి ఘటనలను ప్రోత్సహించడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్ సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, మధుమతి రెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ నాయకులు పెన్నోబులేసు తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న వర్షాలు

పుట్టపర్తి అర్బన్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో మూడోరోజూ జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ జిల్లాలోని 17 మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో అగళిలో 11.6 మి.మీ, నల్లమాడలో 9.8, బుక్కపట్నం 9.4, కొత్తచెరువు 9.4, గాండ్లపెంటలో 9, చిలమత్తూరులో 7.8, పుట్టపర్తిలో 7.6, నల్లచెరువులో 4.4, కదిరిలో 4.2, లేపాక్షిలో 4.2, ధర్మవరంలో 3.4, గుడిబండలో 3, రొద్దంలో 2.8, ఓడీ చెరువులో 2.4, సోమందేపల్లిలో 1.4, బత్తలపల్లిలో 1.2, అమరాపురంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

తెల్లవార్లూ టీచర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌ను పర్యవేక్షిస్తున్న పరిశీలకులు సుబ్బారావు, డీఈఓలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్టీ టీచర్ల కౌన్సెలింగ్ తెల్లవార్లూ కొనసాగింది. తొలిరోజు 350 మంది పూర్తవగా... రెండోరోజు గురువారం సీరియల్ నంబరు 351 నుంచి 1,000 దాకా పిలిచారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్ తెల్లవార్లూ కొనసాగింది. శుక్రవారం సీరియల్ నంబరు 1,001 నుంచి 1,800 వరకు కౌన్సెలింగ్ ఉంటుందని 11 గంటలకు ప్రారంభమవుతుందని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు.

టీచరుపై రెచ్చిపోయిన పరిశీలకులు

'బొచ్చు గాడివి నీకేం సమాధానం చెప్పాలి' అంటూ ఉపాధ్యాయ బదిలీ కౌన్సెలింగ్‌లో పరిశీలకులుగా వచ్చిన జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు గురువారం ఓ టీచరుపై రెచ్చిపోయారు. దీంతో కౌన్సెలింగ్ కేంద్రంలో కొద్దిసేపు తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు...తనకల్లు మండలంలో ప్రభాకర్ టీచరుగా పని చేస్తున్నారు. ఈయన భార్య స్పౌజ్ పాయింట్లు వాడుకున్నారు. ఈ క్రమంలో కౌన్సెలింగ్ సమయంలో భర్త పని చేస్తున్న తనకల్లు మండలంలోనే కోరుకోవాలంటూ అధికారులు సూచించారు. ఈ సమయంలో కలగజేసుకున్న భర్త ప్రభాకర్... సర్ తనకల్లు మండలం కాకుండా పక్క మండలం కదిరి రూరల్‌లో ఇచ్చేలా చూడాలని కోరారు. అలా కుదరదని 'స్పౌజ్' విషయంలో అందరికీ ఒకే నిబంధన పాటిస్తున్నామంటూ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో సదరు టీచర్.. 'అన్నీ కరెక్ట్‌గా చేశామంటున్నారు.. అలా చేసినట్లు రాతపూర్వకంగా ఇవ్వండి' అంటూ అడిగారు. దీంతో పక్కనే ఉన్న పరిశీలకులు సుబ్బారావు రెచ్చిపోయారు. 'నువ్వు బొచ్చుగాడివి అడిగితే మేము చెప్పాలా' అని మాట్లాడారు. సదరు టీచరు కూడా అంతేస్థాయిలో సమాధానం ఇచ్చారు. సాధారణ టీచరుకు ఇచ్చే గౌరవం ఇదేనా.. అని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, డీఈఓ కార్యాలయ సిబ్బంది అంతా వేదికపైకి దూసుకురావడంతో కాసేపు గందరగోళం నెలకొంది. అందరూ సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది.



హాజరైన ఉపాధ్యాయులు

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య



మృతురాలు ఈశ్వరమ్మ

ధర్మవరం అర్బన్: స్థానిక గూడ్స్‌షెడ్డు కొట్టాలకు చెందిన వివాహిత ఈశ్వరమ్మ(45) ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు భర్త మల్లికార్జున, ముగ్గురు కుమారులు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా గురువారం చెరువు ఒకటో మరువ వద్ద నీటిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని సీఐ నాగేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



వాహనంలో ఇరుక్కుపోయిన వ్యక్తి మృతదేహం

కనగానపల్లి: మండల పరిధిలోని దాదులూరు కొట్టాల సమీపంలో 44వ జాతీయ రహదారిపై వాహనంలో వెళ్తున్న ఒక వ్యక్తి అనుమానస్థితిలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. అనంతపురం నుంచి బెంగుళూరు వైపు వెళ్తున్న ఓ జీపు (తుపాన్) రాత్రి సమయంలో రహదారి పక్కన డ్రైవర్ ఆపాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో అటుగా వెళ్తున్న ప్రయాణికులు కొందరు వాహనం దగ్గరకు వెళ్లి చూడగా.. అందులో ఓ వ్యక్తి ఇరుక్కొని విగత జీవిగా ఉన్నట్లుగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాగా, వాహనంలో ఇరుక్కొని మృతి చెందిన వ్యక్తి కర్ణాటకలోని చిక్కబళ్లాపురానికి చెందిన వాడిగా తెలిసింది. కానీ వాహనం ప్రమాదానికి గురై అతను మృతి చెందాడా? లేక ఎవరైనా అతనిని హత మార్చి వాహనంలో పడేసి వెళ్లారా? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

కాలుతున్న పచ్చదనం

- పరిశ్రమల్లో ఇష్టానుసారంగా కలప వినియోగం
- అడ్డగోలుగా వేప, చింత, కానుగ వృక్షాల నరికివేత
- పట్టించుకోని అటవీ అధికారులు



హిందూపురంలోని ఓ పరిశ్రమలో అక్రమంగా నిల్వ చేసిన కలప



పరిశ్రమల్లో కలపకు బదులుగా వినియోగించాల్సిన బ్రికెట్

చిలమత్తూరు: జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో పచ్చదనం కాలి బూడిదవుతోంది. అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పరిశ్రమల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ వేప, చింత, కానుగ వృక్షాల నరికివేతను ప్రోత్సహిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో పచ్చదనం కరువవుతోంది.

హిందూపురం పరిసరాల్లోనే ఎక్కువ..

హిందూపురం రూరల్ మండలం తూముకుంట, గొళ్లాపురం పారిశ్రామికవాడలోని పలు ఫ్యాక్టరీలు, గార్మెంట్స్ పరిశ్రమలు ఉన్నాయి. పరిశ్రమల నిర్వహణకు అవసరమైన కలప కోసం హిందూపురం పరిసర ప్రాంతాలతో పాటు శివారున ఉన్న కర్ణాటక ప్రాంతంలో పెద్ద ఎత్తున చెట్లను నరికి తరలిస్తున్నారు. గొళ్లాపురం, తూముకుంట పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో భారీ వృక్షాలకు సంబంధించిన కలప పెద్ద ఎత్తున డంప్ చేసి ఉండడం కలకలం రేపుతోంది. సాధారణంగా పరిశ్రమల్లో ఉత్పత్తుల కోసం కలపను బాయిలింగ్ చేయాల్సి వస్తోంది. ఇందుకోసం బ్రికెట్‌ను వినియోగించాల్సి ఉంది. అయితే బ్రికెట్ విలువ టన్నుకు రూ. 8 వేలు ఉండడంతో దానికి బదులు కలపనే పరిశ్రమల నిర్వాహకులు ఎంచుకున్నారు. ఫైర్ వుడ్‌కు సంబంధించి అనుమతులు పొంది నిబంధనలకు వ్యతిరేకంగా స్మగ్లర్ల ద్వారా వేప, చింత, కానుగ, ఇతర భారీ వృక్షాలను అడ్డగోలుగా నరికి పరిశ్రమకు తరలించి డంప్ చేస్తున్నారు. ఈ అక్రమాలు బయటకు పొక్కుండా కలపనంతా పొడి చేసి పెడుతున్నారు. ఈ విషయాన్ని బయట పెడితే పని నుంచి తొలగిస్తామని కార్మికులను బెదిరించినట్లుగా సమాచారం. వృక్ష సంపద కరిగి పోతున్న విషయం అటవీ అధికారులకు తెలిసినా... దీనిని తమ ఆదాయ వనరుగా మార్చుకుని నోరు మెదపడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. మొక్కల పెంపకానికి రూ.కోట్లు కుమ్మరించే ప్రభుత్వాలు, ఉన్న వృక్ష సంపదను కాపాడేందుకు కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం లేదని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి పూటే ఎక్కువగా



పరిశ్రమల్లో ఫైర్ వుడ్ బదులు కలపను వినియోగిస్తున్నారు. హిందూపురం పరిసరాలతో పాటు శివారున ఉన్న కర్ణాటక ప్రాంతం నుంచి రాత్రి సమయాల్లో పెద్ద ఎత్తున కలప ఆయా పరిశ్రమలకు చేరుతోంది. అనుమతులు ఉన్న వాటిని పగటి సమయంలో దిగుమతి చేసుకుంటుంటారు. ఈ అంశంపై ఇటీవల అటవీ అధికారులు పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టారు. అయినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

– రవికుమార్, కార్మికసంఘం నేత

ఫైర్‌వుడ్‌కు అనుమతులిచ్చాం

తూముకుంట, గొళ్లాపురం పారిశ్రామికవాడలో ఫైర్ వుడ్ వినియోగించేలా ఓ పరిశ్రమతో పాటు కొన్ని గార్మెంట్స్‌కు కూడా అనుమతులు ఇచ్చాం. వాళ్లు ఏ సమయంలోనైనా పరిశ్రమలకు ఫైర్ వుడ్‌ను దిగుమతి చేసుకోవచ్చు. ఫైర్ వుడ్ కాకుండా ఇతర కలప వినియోగిస్తున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే తనిఖీలు చేపడతాం. వాస్తవాలు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరెడ్డి, ఎఫ్ఆర్ఓ

ఆర్డీటీపై ఆంక్షలు ఎత్తివేయాలి

- మాజీ మంత్రి శంకరనారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్



పాదయాత్రలో రంగయ్యతో కలిసి పాల్గొన్న మాజీ మంత్రి శంకరనారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ (చిత్రంలో) పార్టీ నేతలు ఉమా, తిప్పేస్వామి

కళ్యాణదుర్గం: ఆర్డీటీకి విదేశీ నిధులు అందకుండా విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ డిమాండ్ చేశారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలంటూ మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రకు గురువారం ఆయనతో పాటు మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మద్దతు తెలిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి ఆర్డీటీ వరదాయినిగా ఉందన్నారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా కార్యక్రమాలను చేపడుతూ పేదలకు అన్ని విధాలుగా అండగా ఉందన్నారు. ఆర్డీటీని కాపాడుకునేందుకు జిల్లాలో ఉన్న టీడీపీ ప్రజాప్రతినిధులు, సీఎం చంద్రబాబు ఇప్పటికైనా కళ్లు తెరవాలన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధికి ఆర్డీటీకి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. ఆర్డీటీకి విదేశీ నిధులు అందకుండా తీసుకొచ్చిన నల్ల చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఆర్డీటీ లేకపోతే జరిగే నష్టాన్ని గుర్తించి ఆ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ కోసం రంగయ్య పాదయాత్ర చేపట్టడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వమే స్వయంగా వచ్చి పాదయాత్రను అడ్డుకునేందుకు యత్నించినా ప్రజల సహకారంతో రంగయ్య పాదయాత్ర ముందుకెళ్తోందన్నారు. ప్రజలు సమైక్యంగా పాదయాత్రకు కదలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వర నాయుడు, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీ భీమేష్, మండల కన్వీనర్ హనుమంతరాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడుతో పాటు పలువురు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ఆర్డీటీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి కేసులో ఐదుగురికి రిమాండ్

రాప్తాడు రూరల్: ఇంటి ఎదుట రోడ్డు స్థలం విషయంలో గొడవ చోటు చేసుకుని ప్రత్యర్థులు తోసేయడంతో కిందపడి వృద్ధుడు మృతి చెందిన కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. అనంతపురం రూరల్ సీఐ శేఖర్ తెలిపిన మేరకు... రాచానపల్లి పంచాయతీ నల్లనర సింగయ్యకాలనీలో నివాసముంటున్న కోనయ్య కుమార్తె విదేశాల్లో స్థిరపడింది. తనకున్న 5 సెంట్లకు పైగా స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాలని తండ్రికి తెలపడంతో మూడు రోజుల క్రితం ఆ ప్రాంతాన్ని కోనయ్య శుభ్రం చేయించి, మార్కింగ్ వేయిస్తున్న సమయంలో రోడ్డు స్థలాన్ని ఆక్రమించారంటూ పక్కనే నివాసముంటున్న గంగాధర్, ఆయన బంధువులు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో వారు కోనయ్యను తోసేయడంతో వెనుక వైపు కిందకు పడిన ఆయన తలకు తీవ్ర గాయమైంది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు...గంగాధర్‌తో పాటు మరో నలుగురిని గురువారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఎట్టకేలకు వినియోగంలోకి జనరేటర్



మరమ్మతుల అనంతరం పనిచేస్తున్న జనరేటర్

సాక్షి ఎఫెక్ట్..

ధర్మవరం అర్బన్: స్థానిక ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌కు ఏర్పాటు చేసిన జనరేటర్ ఎట్టకేలకు పనిచేయడం మొదలు పెట్టింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సొంత నియోజకవర్గంలోని ఆస్పత్రిలో జనరేటర్ పనిచేయకపోవడం... విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు చోటు చేసుకుంటుండడంతో డయాలసిస్ రోగులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 11న 'డైయాలసిస్' శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రహికేర్ ఏజెన్సీ నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడారు. తీవ్రస్థాయిలో మందలించారు. దీంతో రహికేర్ ఏజెన్సీ నిర్వాహకుల నుంచి సమాచారం అందుకున్న జనరేటర్ కంపెనీ సాంకేతిక నిపుణులు బుధవారం ఏరియా ఆస్పత్రికి చేరుకుని జనరేటర్‌లో తలెత్తిన లోపాను సరిచేశారు.

పంటల సాగులో వైవిధ్యం అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్రాయుడు

హిందూపురం: పంటల సాగులో వైవిధ్యతతో పాటు సాంకేతికను పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ చంద్రాయుడు సూచించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా హిందూపురం మండలం కిరికెర, బసవనపల్లి రైతు సేవా కేంద్రాల్లో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందుల వినియోగానికి స్వస్తి చెప్పాలన్నారు. కొత్త వంగడాలు, డ్రోన్ స్ప్రేయింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ బి. ప్రతాప్, హేమంత రాజు, కె.బాలాజీ నాయక్, డాక్టర్ శిరీషతో పాటు మండల వ్యవసాయాధికారులు సురేంద్ర నాయక్, మహేష్ నాయక్, బీమా కంపెనీ ప్రతినిధులు అశోక్, నరేంద్ర, రైతు సేవ కేంద్ర సిబ్బంది కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

న్యాయవాదికి 'సంగం' బెదిరింపు లేఖ

చిలమత్తూరు: న్యాయవాది గోవిందరాజులుకు హిందూపురం మున్సిపాలిటీ మాజీ కమిషనర్ సంగం శ్రీనివాసులు బెదిరింపు లేఖ పంపడం సంచలనం రేకెత్తించింది. ఆయన కమిషనర్‌గా పనిచేసిన కాలంలో చోటు చేసుకున్న అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా మున్సిపల్ శాఖలోని ఉన్నతస్థాయి అధికారులకు లేఖ రాయడంతో పాటు కమిషనర్‌గా తన నియామకాన్ని సవాల్ చేస్తూ పలువురు కోర్టుకు వెళ్లడం వంటి అంశాలపై ఏ ఆధారాలతో ఆరోపణలు చేశావని లేఖలో సంగం శ్రీనివాసులు ప్రశ్నించారు. ఆధారాలు చూపకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటానని బెదిరింపులకు దిగారు. అయితే ఈ అంశంలో న్యాయవాది గోవిందరాజులు కూడా లేఖ ద్వారా ఘాటుగానే స్పందించారు. హిందూపురం మున్సిపాలిటీ నిధులు దుర్వినియోగం జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయని, ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని, కమిషనర్ అక్రమాలపై దర్యాప్తు జరిపి చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులుకు లేఖ రాసినట్లు వివరించారు. ఈ అంశంలో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టకపోతే హైకోర్టు, ఏసీబీ కోర్టుకు వెళ్లి శ్రీనివాసులు అవినీతిపై పోరాడతానని పేర్కొన్నారు. అవినీతిని ప్రశ్నిస్తే న్యాయవాది అయిన తనకు ఒక అధికారి బెదిరింపు లేఖ పంపడం వెనుక ఉన్న దురుద్దేశం తనకు తెలుసునన్నారు. కాగా న్యాయవాదికి కమిషనర్ రాసిన లేఖ వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉందనే ఆరోపణలు వినవస్తున్నాయి.

ఇద్దరు పిల్లలతో కలసి తల్లి అదృశ్యం

ఉరవకొండ: నియోజకవర్గ కేంద్రానికి చెందిన వివాహిత షాహినా తన కుమారుడు, కుమార్తెతో కలసి గురువారం నుంచి కనిపించకుండా పోయింది. గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ మహానంది తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి పండిట్లు బలి

- సర్దుబాటు పేరుతో రెండేళ్లకోసారి బదిలీ అవుతున్న డీఈఓ పూల్‌లోని పండిట్లు
- ఆరేళ్లలో నాలుగోసారి బదిలీ అవుతున్నామంటూ ఆవేదన
- పాఠశాల విద్య ఆర్జేడీని అడ్డుకున్న పండిట్లు



ఆర్జేడీ శామ్యూల్‌ను ఘెరావ్ చేస్తున్న పండిట్లు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఈఓ పూల్‌లో ఉన్న బాషా పండితుల ఇబ్బందులను కూటమి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అదే సమయంలో ఉపాధ్యాయ సంఘాలూ స్పందించడం లేదు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ గురువారం స్థానిక పంగల్‌రోడ్డులోని ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో జరుగుతున్న ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్‌ను డీఈఓ పూల్‌లో ఉన్న పండిట్లు అడ్డుకున్నారు. అరగంటకు పైగా బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్‌ను ఘెరావ్ చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ.. డీఈఓ పూల్‌లో ఉన్న పండిట్లను ప్రతి రెండేళ్లకోసారి బలవంతపు బదిలీలు చేస్తున్నారన్నారు. గత ఆరేళ్లలో ఇది నాలుగోసారి బదిలీ అన్నారు. గత రెండేళ్లలో సర్దుబాటు పేరుతో మరొక చోటుకి పంపారని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,300 మంది పండిట్లు డీఈఓ పూల్‌లో ఉంటే ఉమ్మడి జిల్లాలోనే 111 మంది ఉన్నారన్నారు. వీరిలో తెలుగు 89 మంది, హిందీ 14, ఉర్దూ ఏడుగురు, కన్నడ ఒకరు ఉన్నారన్నారు. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించగా... 2024, డిసెంబర్ 20న జస్టిస్ మన్మధరావు ధర్మాసనం (సింగిల్ బెంచ్) పండితులకు అనుకూలంగా తుది తీర్పు ఇచ్చారని గుర్తు చేశారు. 2019 నుంచి అందాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించి 3 నెలల గడువు లోపు ప్రమోషన్ ఇవ్వాలంటూ ఆదేశించారన్నారు. పలుమార్లు విద్యా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదున్నారు. ఇంతలో ఎస్జీటీ సంఘాల నాయకులు స్టేటస్ కో తెచ్చి సమస్యను మరింత జటిలం చేశారని వాపోయారు. ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తే సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చివరకు పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ తీరుతో వలస కార్మికుల్లాగా బతకాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సరైన న్యాయం చేయాలని కోరారు. ఎస్జీటీల బదిలీల అనంతరం చర్యలు తీసుకుంటామంటూ ఆర్జేడీ హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

ఆర్టీసీని లాభాల బాట పట్టిద్దాం



మాట్లాడుతున్న డీపీటీఓ మధుసూదన్

పుట్టపర్తి టౌన్: టికెట్ ఆదాయంతో పాటు పర్యాటక కేంద్రాలకు అదనపు బస్సులు నడిపి ప్రతి డిపో పరిధిలోనూ నష్టాలు తగ్గించి, ఆర్టీసీని లాభాల బాట పట్టిద్దామని డీపీటీఓ మధుసూదన్ పిలుపునిచ్చారు. ఆర్టీసీకి ఆదాయాన్ని పెంచే మార్గాలపై తన కార్యాలయంలో జిల్లాలోని అన్ని డిపోల మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్ సిబ్బంది, అకౌంట్స్ విభాగం సూపర్‌వైజర్లతో గురువారం ఆయన సమీక్షించారు. ఆర్టీసీ ఆదాయాన్ని పెంచి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా బస్సులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమయపాలన పాటించాలన్నారు. ప్రయాణికుల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కారం చూపాలని డిపో మేనేజర్లను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి డ్రైవర్ కృషి చేయాలన్నారు. ప్రతి బస్ స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీరు, బస్ టైమింగ్ బోర్డులు, శుభ్రమైన టాయిలెట్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పర్యాటక కేంద్రాలకు రద్దీని బట్టి అదనపు బస్సులు నడపాలన్నారు. కార్గో ఆదాయాన్ని మరింత పెంచాలన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

- రూ.8 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన దేరవకొండ ఏఎస్పీ మౌనిక

దేవరకొండ (నల్లగొండ): ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురి నుంచి రూ.17లక్షలు వసూలు చేసి పరారైన నిందితుడిని గురువారం నల్లగొండ జిల్లా దేవరకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను దేవరకొండ ఏఎస్పీ మౌనిక గురువారం విలేకరులకు వెల్లడించారు. అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన మాదిన్నె కృష్ణ అలియాస్ వేణుగోపాలరెడ్డి 2021లో దేవరకొండకు వలస వచ్చి బీఎస్ఆర్ కాలనీలో నివాసమేర్పరుచుకున్నాడు. తాను ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ప్రాజెక్టు ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తున్నట్లు చుట్టుపక్కల వారిని నమ్మించాడు. తాను పనిచేస్తున్న శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కాలనీకి చెందిన ముడావత్ స్వాతి, ఆమె భర్త రమేష్, షేక్ సైదాబేగం, ఆమె కుమారుడు షేక్ తబ్రీజ్‌కు నమ్మబలికి వారి వద్ద నుంచి సుమారు రూ.17లక్షలు వివిధ దఫాలుగా తీసుకున్నాడు. డబ్బులు ఇచ్చిన వారు ఉద్యోగాల విషయం ఏమైందంటూ అడిగినప్పుడల్లా టైం పడుతుందని చెబుతూ కాలం వెళ్లదీశాడు. ఇటీవల వారు గట్టిగా నిలదీయడంతో ఇంటికి తాళం వేసి అజ్ఞాతంలోకి వెళ్లాడు. దీంతో బాధితులు ఈ ఏడాది మార్చి 1న దేవరకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఏపీలోని అనంతపురం జిల్లాలో వేణుగోపాలరెడ్డిని అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి రూ.8లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, కృష్ణ గతంలో తన భార్యతో కలిసి ఖమ్మం జిల్లా తనికెళ్ల గ్రామంలో టైలరింగ్‌తో జీవనం కొనసాగించేవాడని, టైలరింగ్ ద్వారా వచ్చే డబ్బులు సరిపోక అక్కడ కొద్దిమందితో కలిసి చిట్టీలు నిర్వహించి అక్కడి నుంచి అనంతపురానికి ఉడాయించినట్లు ఏఎస్పీ తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ పలువురిని మోసం చేసి దేవరకొండకు వచ్చాడన్నారు. కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐ నర్సింహులు, ఎస్ఐలు కోటేష్, నారాయణరెడ్డి, పోలీస్ సిబ్బంది సతీష్, రాజారాం, అంజి, వెంకన్న, చాంద్‌పాషా, సింహాద్రి పాల్గొన్నారు.

కిడ్నాపర్ బారి నుంచి తప్పించుకున్న బాలిక



బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ట్రస్ట్ సభ్యులు

హిందూపురం టౌన్: రామగిరి మండలంలో దళిత మైనర్ బాలికపై అఘాయిత్యం ఘటన మరువక ముందే హిందూపురంలో ఓ బాలిక కిడ్నాప్ ఉదంతం సంచలనం రేకెత్తించింది. కిడ్నాపర్ బారి నుంచి తప్పించుకున్న బాలిక నాటకీయ పరిణామాల మధ్య తల్లిదండ్రుల వద్దకు సురక్షితంగా చేరింది. ఇందుకు హిందూపురంలోని అల్ ఇందాద్ ట్రస్ట్ పూర్తి స్థాయిలో సహకరించింది. వివరాలు... గురువారం ఉదయం హిందూపురానికి చెందిన పదేళ్ల వయసున్న ఓ బాలికను ఐస్‌క్రీం, చాక్లెట్‌లు ఇప్పిస్తానంటూ ఓ గుర్తు తెలియని వ్యక్తి తన వెంట పిలుచుకెళ్లాడు. లేపాక్షి – నగరిగెర గ్రామాల మధ్య ఉన్న వైన్ షాప్ వద్దకు చేరుకున్న తర్వాత ఆ బాలికను బయట ఉండమని చెప్పి వైన్ షాపులోకి వెళ్లాడు. అప్పటికే అతని ప్రవర్తనపై అనుమానం వచ్చిన బాలిక అవకాశం కోసం దొరకగానే తప్పించుకుంది. ఒంటరిగా రహదారిపై కనిపించిన బాలికను గమనించిన ఆటో డ్రైవర్ రామాంజి.. వెంటనే వివరాలు ఆరా తీసి, సురక్షితంగా లేపాక్షికి చేర్చాడు. అక్కడ తనకు పరిచయమున్న బాబా అనే వ్యక్తి విషయం తెలపడంతో ఆయన ద్వారా సమాచారం అందుకున్న అల్ ఇందాద్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అమన్, సభ్యులు సాదిక్, రహన్, బాబా ఫక్రుద్దీన్, మొయిన్, ఆరిఫ్, రామాంజినేయులు తదితరులు లేపాక్షికి వెళ్లి బాలికకు ధైర్యం చెప్పారు. గురువారం సాయంత్రం తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బాలికలు, యువతులు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. కిడ్నాపర్ బారి నుంచి బాలిక సురక్షితంగా బయటపడిన విషయం తెలుసుకున్న ఊపిరి పీల్చుకున్నారు.